# మినీకథ

**"మన ఏజెంట్ నెం. 58 అత్యంత కీలకమైన కార్యంమీద ఆంధ్రదేశం వెళ్ళాడు. తన ఎడ్రసు కూడా మనకి తెలియపర్చకుండా రిపోర్ట్సు పంపుతున్నాడంటే చాలా ప్రమాదభూయిష్ఠమైన పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నాడని మనం అర్థం చేసుకోవచ్చు.**

## గూఢచారి అర్థనూట పదార్లు



ఇప్పుడు ఈ అర్జెంటు మెసేజి అతనికి అందించాలి. నీ శక్తి సామర్థ్యాల మీద పరిపూర్ణ విశ్వాసం వుండబట్టి. అత్యంత రహస్యమైన ఈ పనికి నిన్ను పిలిపించాం" గుక్కతిప్పుకోవటానికి ఒక్క క్షణం ఆగాడు సిబిఐ డైరెక్టరు.

ఏజెంట్ 116 శ్రద్ధగా వింటున్నాడు. దేశంకోసం, తన సంస్థకోసం ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పించటానికి వెనుకాడడని సీనియర్ అధికారులకి అతనంటే గౌరవం

"సర్, కనీసం అతను ఏ పేరుతో వ్యవహరించబడుతున్నాడో తెలుసా ?" అడిగాడు ఏజెంట్.

"ఎస్. అతను సుబ్బారావు అనే పేరుతో వుంటున్నాడు. ఆంధ్రాలో ఏప్రాంతాల్లో వుండేదీ నా పియే దగ్గర ఫైలులో అన్ని డీటెయిల్సువున్నాయి. ఈ రాత్రికే బయలుదేరాలి నువ్వు. బెస్టాఫ్ లక్" లేచి నిలబడి షేక్‌హాండిచ్చాడు సిబిఐ డైరెక్టర్

నూటపదార్లు థాంక్సుచెప్పి తీవ్రంగా ఆలోచిస్తూ డైరెక్టర్ పియే వున్న రూమ్‌లోకి దారితీశాడు.

* * *

ఏజెంట్ నూటపదారు సూట్‌కేస్ పట్టుకుని రైలుదిగాడు. అతను ఆంధ్రారావటం యిదే ప్రథమం. స్టేషన్ బయట రిక్షావాళ్లు, గుర్రబ్బండీవాళ్ళు చుట్టూ మూగారు. వాళ్ళని వదిలించుకునేసరికి నీరసం వచ్చింది! నడిచే వూళ్ళోకెళ్ళాలని. అలా పరిసరాల్ని, వ్యక్తుల్ని గమనించ వచ్చుని, సూట్‌కేస్ చేత్తో పట్టుకుని నడవటం ప్రారంభించాడు.

'చిన్నవూరే' అనుకున్నాడు. సుబ్బారావుని కలుసుకున్నాక అతనే ఏజెంట్ 58 అని ఖచ్చితంగా తెలిస్తేగానీ మెసేజ్ అందించటానికి వీల్లేదు. అందుకని అత్యంత రహస్యమైన కోడ్‌ని ఉచ్చరించాలి. ఆ కోడ్ వర్డ్సు మననం చేసుకున్నాడు

"ఆకాశం నీలంగా వుంది" అని అంటే. ఎదుటివాడు నిజం సుబ్బారావయితే (అంటే నెం. 58) "అవును వీపు కూడా దురదగా వుంది' అనాలి.

డూటీ ఎక్కాక ఒక్కక్షణం కూడా వృథా చేయటం 116 నైజానికి విరుద్ధం. కొంతదూరం నడిచాక యెదురుగా వస్తున్న ఒక ఆసామిని యెన్నుకున్నాడు ఆయన్ని ఆపి.

"ఎక్స్‌క్యూజ్‌మీ .... దయచేసి సుబ్బారావుగారిల్లు యెక్కడుందో చెప్తారా" అని చిరునవ్వుతో అడిగాడు.

ఆసామీ ఎగాదిగా చూశాడు "ఏ సుబ్బారావు " అని ప్రశ్నించాడు.

నూటపదార్లు మొహంలో చిరునవ్వు మాయమైంది. "ఎ-ఎంతమంది సుబ్బారావులున్నారు?" మహా వుంటే ఐదారుగురు .... కొంచెం కష్టపడితే 58ని పట్టుకో వచ్చని అడిగాడు.

ఆసామీ ఫెళ్ళున నవ్వాడు. "మీరు ఈ ప్రాంతాలకి కొత్తవారనుకుంటాను. ఆంధ్రదేశంలో కొన్ని లక్షలమంది సుబ్బారావులున్నారు. ఈ వూళ్ళో కనీసం కొన్ని వందలైనా వుంటారు...."

నూటపదార్లు బిక్కమొహం వేశాడు. కేసు ఇంత జటిలమైంది అనుకోలేదు.

ఆసామీకి జాలేసింది. తనకి చేతనైన సాయం చేద్దామనిపించింది.

"చూడు బాబూ, మా ఆంధ్రదేశం గురించి నీకు బొత్తిగా తెలీదనుకుంటా. ఇక్కడ సుబ్బారావులు, వెంకటేశ్వరరావులు, రామారావులు పెద్ద సంఖ్యలో సంచరిస్తుంటారు. వీరిలో సుబ్బారావుల సంఖ్యే ఎక్కువ. ఉదాహరణకి చూడు. షావుకారు సుబ్బారావుది అదిగో ఆ నీలం మేడ. లాయరు సుబ్బారావు ఇల్లు ఇక్కడికి ఓ ఫర్లాంగు దూరం. అదిగో ఆ షాపు మంగలి సుబ్బారావుది. అలాగే చాకలి సుబ్బారావు, పాల సుబ్బారావు, అడితీ సుబ్బారావు గానుగ సుబ్బారావు ఇలా ఇంతమంది సుబ్బారావులున్నారు. అంతెందుకు ? నా పేరు కూడా సుబ్బారావే మరినీకే సుబ్బారావు కావాలి ?" అని అడిగాడు.

గూఢచారి నూటపదార్లు తీవ్రంగా ఆలోచించాడు. ఇక లాభంలేదు ! డైరెక్టుగా రంగంలోకి దిగిపోవాలి ఎంత ఖర్చైనా, ఎన్నిరోజులైనా, నిద్రాహారాలు మానైనా సరే సుబ్బారావుని కనుక్కోవాలి. ప్రస్తుతం తన పరిశోధన సాగేది ఒక్క కోడ్‌వర్డ్సు సాయంతోనే. ముందర ఈ సుబ్బారావుతోనే పరిశోధన మొదలు పెడదాం ...అని యిలా ఆలోచించి నూటపదార్లు ఒకసారి ఆవులించి. ఒళ్ళు విరుచుకుని యెటో చూస్తున్నట్లు మొహంపెట్టి. నెమ్మదిగా "ఆకాశం నీలంగా వుంది" అన్నాడు.

వెంటనే ఆసామీ "ఓహో మీకు గూఢచారి సుబ్బారావుగారిల్లు కావాలా ? నేరుగా వెళ్ళి ఎడంవేపు తిరగండి. కుడివేపు మూడో ఇల్లు " అని చెప్పి తనదారిన చక్కాపోయాడు.

— ప్రసన్నకుమార్ సర్రాజు